క్లుప్తంగా

స్కూటీని ఢీకొట్టిన టిప్పర్

● ఒకరి మృతి



నెల్లికుదురు : స్కూటీని టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన ఘటన నల్లగుట్ట తండా శివారు భోజ్యా తండాలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం కేసముద్రం మండలం తౌర్య తండాకు చెందిన మూడావత్ రామచంద్రు(59) అతని కొడుకు శ్రీనివాస్ నర్సింహుల పేటలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. శ్రీనివాస్‌కు కురవి జాతరలో డ్యూటీ బందోబస్తు పడగా ఇంటివద్ద ఉండడం కోసం రామచంద్రు వెళ్తున్నాడు. ఈక్రమంలో నెల్లికుదురు మండలం నల్లగుట్ట తండా శివారు భోజ్యాతండా మలుపు వద్ద అతి వేగంగా వస్తున్న టిప్పర్ స్కూటీని ఢీకొట్టగా రామచంద్రు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోళ్ల వ్యాన్ బోల్తా

డోర్నకల్ : మండలంలోని బంజర, సీతారాంపురం గ్రామాల మధ్య గురువారం కోళ్ల లోడుతో వెళ్తున్న వ్యాను బోల్తా పడింది. గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న మిరపతోటలో బోల్తా కొట్టింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా ప్రమాదంలో కోళ్లు మృతి చెందడంతో సుమారు రూ.1.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు డ్రైవర్ తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో రెండేళ్ల జైలు

మరిపెడ : గృహహింస, వరకట్న వేధింపుల కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు స్థానిక ఎస్సై తాహేర్‌బాబా తెలిపారు. మరిపెడకు చెందిన ఎడవెల్లి సజితను ఆమె భర్త రమణారెడ్డి అదనపు కట్నం కోసం ఇంట్లో వేధింపులకు గురి చేస్తున్నాడని 2015లో మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కృష్ణకుమార్ కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్సై బాబులాల్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా సాక్షులను పరిశీలించిన తొర్రూర్ జూనియర్ సివిల్ జడ్జి సరిత ఎడవెల్లి వెంకటరమణారెడ్డికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని తెలిపారు.

నగదు అప్పగింత

గార్ల : సెల్‌ఫోన్ మెసేజ్ వల్ల పోగొట్టుకున్న నగదును, సైబర్ క్రైం ద్వారా రికవరీ చేసి, తిరిగి బాధితుడికి అప్పగించిన సంఘటన గురువారం పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. బయ్యారం సీఐ రవికుమార్ కథనం ప్రకారం వివరాలు మండలంలోని రాజుతండాకు చెందిన నూనావత్ రఘురామ్ 2022 సంవత్సరంలో తన సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్ ద్వారా మోసపోయి రూ.48,429 నగదును తన అకౌంట్ నుంచి కోల్పోయి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోగొట్టుకున్న నగదు అప్పగించిన సీఐ, రవికుమార్‌కు రఘురామ్ కృతజ్ఞతలు తెలిపారు.

బావిలో దూకిన వ్యక్తి మృతి



ప్రకాశ్ మృతదేహం

కేసముద్రం : పెదనాన్న దశదినకర్మకు వచ్చిన ఓ వ్యక్తి స్నానం చేసేందుకు బావిలో దూకగా, బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతిచెందిన విషాదకర ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండలో గురువారం చోటుచేసుకుంది. ఏఎస్సై కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం .. పెనుగొండ గ్రామానికి చెందిన నలమాస ప్రకాశ్(50) మహబూబాబాద్‌లో ఉంటూ భవననిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రకాశ్ పెదనాన్న నలమాస మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మల్లయ్య దశదినకర్మ ఉండటంతో, ప్రకాశ్ కుటుంబ సభ్యులతో కలిసి పెనుగొండకు వచ్చాడు. దశదినకర్మ కార్యక్రమంలో భాగంగా స్నానం చేసేందుకు పలువురితో కలిసి చెరువుశిఖంలో ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ప్రకాశ్ పైనుంచి బావిలోకి దూకడంతో, అతడి కాళ్లు బురద (ఒండ్రుమట్టి)లో చిక్కుకున్నాయి. బయటకు రాలేకపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. బావిలో దూకిన ప్రకాశ్ బయటకు రాకపోవడంతో అక్కడున్న వారంతా కేకలు వేశారు. ఓ వ్యక్తి బావిలోకి దూకి మృతదేహన్ని బయటకు తీశాడు. కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై తెలిపారు. ప్రకాశ్‌కు భార్య రజిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బెల్లం స్వాధీనం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని శనిగపురం గ్రామం నుంచి అయోధ్య గ్రామానికి వెళ్లే దారిలోని ఓ డొంక సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు నిల్వ చేసిన ఎనిమిది క్వింటాళ్ల నల్లబెల్లం బస్తాలు, రెండు కిలోల పటికను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని రూరల్ ఏఎస్సై సూరయ్య గురువారం తెలిపారు.



నెహ్రూసెంటర్: సదస్సులో మాట్లాడుతున్న కాసు మాధవి



గార్ల: సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



నెల్లికుదురు: ఎంపీడీఓ కార్యాలయంలో..

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పలువురు వక్తలు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఆయా మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులు, సిబ్బంది, ఉపాధ్యాయినులు, జీపీ కార్యదర్శులను శాలువాలతో సన్మానించారు. -సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ జిల్లా కోశాధికారి రజిత



డోర్నకల్: ఎంపీడీఓ కార్యాలయంలో..



గూడూరు: గాజులగట్టు అంగన్‌వాడీ కేంద్రంలో..



కొత్తగూడలో..



తొర్రూరులో..



మహబూబాబాద్ రూరల్: మహిళా ఉపాధ్యాయినులకు సన్మానం..

స్వయంపాలన దినోత్సవం



నెల్లికుదురు: విద్యార్థులతో ఉపాధ్యాయులు

నెల్లికుదురు : మండలంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం సాయిలు ఆధ్వర్యంలో గురువారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్, సిరి ఎంటర్‌ప్రైజెస్ దాసరి కవితయాకన్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించి ఉపాధ్యాయ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కురవి : మండలంలోని తట్టుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు.హెచ్‌ఎంగా చరణ్‌తేజ్, ఎంఈఓగా గౌస్, పీఈటీగా ఎస్‌కె రాఖీబ్ వ్యవహరించారు.హెచ్‌ఎం ఆర్.నిరంజన్, ఉపాధ్యాయులు ఎండీ ఖదీర్, వి.శ్రీనివాసరావు, సరిత, భాగ్యలక్ష్మి, పి.రిచా పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..

కొత్తగూడ : మండలంలోని వేలుబెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు దివ్య, ఉపాధ్యాయులు జయసుధ, రాంచందర్, కృష్ణమూర్తి, ప్రమీల, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకకు సిద్ధం



మహబూబాబాద్ రూరల్ : కల్యాణోత్సవానికి ముస్తాబైన రాజరాజేశ్వర స్వామి దేవాలయం



చిన్నగూడూరులోని శివాలయం



దంతాలపల్లి: రామలింగేశ్వర స్వామి ఆలయం

మహబూబాబాద్ రూరల్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం శివరాత్రి సందర్భంగా ఉమాచంద్రమౌళీశ్వరస్వామి దేవాలయం, పార్వతీరామలింగేశ్వర, భక్త మార్కండేయ, స్వయంభూ వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆయా దేవాలయాల అర్చకులు తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి 10 గంటల వరకు గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక రుద్రాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయని, ఆయా దేవాలయాల్లో రాత్రి 8:30 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవాలు జరుగుతాయని తెలిపారు. భక్తమార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక వివేకానంద సెంటర్‌లో పార్వతీపరమేశ్వరుల ఎదుర్కోలు ఉత్సవం జరుగుతుందని సంఘం బాధ్యులు తెలిపారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సెంటర్‌లో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, శివలింగ అభిషేకాలు జరుగుతాయని బ్రహ్మకుమారి సుజాత తెలిపారు.

చిన్నగూడూరు : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని శివాలయాలను మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

ఆలయాలకు శివరాత్రి శోభ

దంతాలపల్లి : కాకతీయుల కాలంలో పెద్దముప్పారం గ్రామంలో నిర్మించిన పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయానికి శివరాత్రి శోభ సంతరించుకుంది. నేడు శివరాత్రి మహోత్సవం పురస్కరించుకుని ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ప్రత్యేకాభిషేకంతో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, అనంతరం సాయంత్రం 5 గంటలకు రుద్రాభిషేకం, అంకురార్పణ జరుగుతాయన్నారు. రాత్రి 9 గంటలకు స్వామి వారి కల్యాణమహోత్సవం నిర్వహిస్తామని పాలంపల్లి రమనశర్మ, పవన్‌శర్మ అన్నారు.

కిట్ అందజేత



మరిపెడ : ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సుఖప్రసవాలు జరుగుతాయని మరిపెడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి గుగులోత్ రవికుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం మండలంలోని ఆనేపురం గ్రామానికి చెందిన మల్లికంటి అనూషకు సుఖప్రసవం చేశారు. అనంతరం ప్రభుత్వం అందించిన (ఎంసీహెచ్) మదర్ చైల్డ్‌కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ కిట్టులో 16రకాల వస్తువులు ఉంటాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మానస, స్టాఫ్‌నర్స్ సుందరి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బయ్యారం: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు

బయ్యారం : మండలంలోని కొత్తపేట, బయ్యారం పంచాయతీల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం శంకుస్థాపన చేశారు. కొత్తపేట-గంధంపల్లిలో సీసీరోడ్ల నిర్మాణానికి, బయ్యారం సొసైటీలో రైతు విశ్రాంతి భవనం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కేసముద్రం: కాట్రపల్లిలో..

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కేసముద్రం/డోర్నకల్/ మరిపెడ : కేసముద్రం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో, డోర్నకల్ మండలంలోని అమ్మపాలెంలో, మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను స్థానిక ప్రజా ప్రతినిధులు గురువారం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలి

కురవి : ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య అన్నారు. గురువారం మండలంలోని రాజోలులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. బడ్జెట్‌లో నిధులు కోత విధించి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు యత్నాలు జరుగుతున్నాయన్నారు. నాయకులు షేక్ మల్సూర్, మనోహర్, వెంకన్న, కూలీలు పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం

మహబూబాబాద్ రూరల్ : మానుకోట డీఎస్పీగా విదులు నిర్వర్తించిన తీర్థాల సత్యనారాయణ బదిలీపై హనుమకొండకు వెళ్లగా ఆయనను హైమ గార్డెన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు గురువారం శాలువాతో ఘనంగా సత్కరించి మెమెంటో బహూకరించారు. లెనిన్ బాబు, చల్లగుండ్ల రాజేష్, విశ్వనాథం, వెంకటేశ్వర్లు సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు అందించాలి

తొర్రూరు : పంచాయతీ కార్మికులకు వెంటనే వేతనాలు అందించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. పంచాయతీ సిబ్బందికి వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ అనుబంధ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొద్య బీకు, యాకూబ్, శ్రీను, విష్ణు, వంశీ, యాకన్న పాల్గొన్నారు.

రైతు రక్షణ చట్టం తేవాలి

దంతాలపల్లి : పండించిన పంటకు గిట్టుబాటు ధర కోసం రైతు రక్షణ చట్టం తేవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నల్లపు సుధాకర్ అన్నారు. మండలంలోని దాట్ల గ్రామంలో గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయిన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర హక్కు అమలయ్యేటట్లు ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలన్నారు.

పుస్తక పఠన ప్రదర్శన

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని తెలంగాణ పుస్తక పఠన వ్యక్తి అభ్యున్నతి ప్రదర్శనను జిల్లా గ్రంథాలయాధికారి శ్రీలత గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ..పుస్తక పఠనం క్రమ శిక్షణ వ్యక్తి విజయాల వైపు నడిపిస్తుందన్నారు. ఈ పుస్తక ప్రదర్శన ఈ నెల 15 వరకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందన్నారు. బుక్ హౌజ్ మేనేజర్ బండారి బాబు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ

కొత్తగూడ : మండలంలోని దివ్యాంగులకు ఐసీఎం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వీల్ చైర్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంస్థ ప్రతినిధి సేవ్యా నాయక్ మాట్లాడుతూ దివ్యాంగులకు సమాజంలో తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్ల నారాయణరెడ్డి, వజ్జ సారయ్య, మొగిళి, డేవిడ్‌పాల్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ గురుకులాల ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి, రుక్మాపూర్ కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశ పరీక్ష ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు మానుకోట సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ జయలక్ష్మి గురువారం తెలిపారు.జిల్లాలోని ఒక్కటే పరీక్ష కేంద్రంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

డీఏలు విడుదల చేయాలి

మహబూబాబాద్ అర్బన్ : పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాకముందే పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రభాకర్ హాజరై మాట్లాడారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్ష కార్యదర్శి చెవుల నాగార్జున, భీమాండ్ల సారయ్య నాయకులు కడారి శ్రీనివాస్, హరిచంద్ నాయక్, సునిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిన నాయకులు

నెల్లికుదురు : మున్నూరు కాపుల హక్కుల కోసం పోరాడేది వద్దిరాజు రవిచంద్ర అని ఆ సంఘం నాయకులు యాసం రమేశ్, పాశం రమేశ్ అన్నారు. గురువారం ఖమ్మం పట్టణంలో రెండో సారి రాజ్యసభ సభ్యుడుగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర ఆశీర్వాద సభకు మండలం నుంచి మున్నూరు కాపులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. బండి శ్రీనివాస్, సోమయ్య, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారం డబ్బులు స్వాహా?

గూడూరు : హరితహారంలో మొక్కలు నాటకుండానే సుమారు రూ. 15 లక్షల నగదు స్వాహా చేసినట్లు మండలంలోని కోబల్‌తండా గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు గురువారం మండల పరిషత్ అధికారి (ఎంపీడీఓ)కు ఫిర్యాదు చేశారు. కోబల్‌తండాకు చెందిన ఉపాధి హామీ కూలీలు భాస్కర్, ఈరాసింగ్, శ్రీనివాస్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. 2022-23 సంవత్సరంలో ఉపాధి పనులను 50 మంది కూలీలు పనిచేశారు. తమకు రావాల్సిన కూలి డబ్బులు ఇప్పిస్తానని గ్రామానికి చెందిన మహిళా గ్రూపు ప్రతినిధి ఒకరు తమ ఆధార్, పోస్టాఫీసు అకౌంట్ పుస్తకాలు తీసుకున్నాడన్నారు. తమకు తెలియకుండానే హరితహారంలో మొక్కలు నాటినట్లు తప్పుడు సమాచారంతో రూ.15 లక్షల వరకు స్వాహా చేసినట్లు తెలిసిందన్నారు. ఇదే విషయమై ఎంపీడీఓను అడగ్గా, డబ్బులు స్వాహా చేసినట్లు ఫిర్యాదు చేశారని విచారణ చేస్తామన్నారు.

నియామకం

మహబూబాబాద్ రూరల్ : డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని చిన్నగూడూరు మండలం విస్సంపల్లి గ్రామానికి చెందిన షాగంటి సందీప్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియామకం అయ్యారు.జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంకర అయ్యప్పరెడ్డి గురువారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

లబ్ధిదారులకు తప్పని ఇబ్బంది

గార్ల : మండలంలో ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ ప్రక్రియ సక్రమంగా చేయకపోవడంతో జీరో బిల్లు రాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హరినాయక్, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

సంత వేలం రూ.15,77,000

నర్సింహులపేట : మండల కేంద్రంలో నిర్వహించే సంత వేలం పాటను గురువారం రూ.15,77,000 దక్కించుకున్నట్లు గ్రామ ప్రత్యేకాధికారి ఎంపీఓ సోమ్‌లాల్ తెలిపారు. నర్సింహులపేటలో ప్రతి శనివారం జరిగే సంత వేలంను ఖమ్మం జిల్లాకు చెందిన అజీం దక్కించుకున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం వేలం నిర్వహించినట్లు, సంతలో ఏలాంటి సమస్యలు ఉన్న తమ దృషికి తీసుకరావాలని సూచించారు. కారోబార్ బేతమల్ల రమేష్, సిబ్బంది వెంకన్న, మల్లయ్య, రమేష్, పుల్లయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మహబూబాబాద్ : మానుకోటలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మున్సిపాలిటీ ఎదుట ధర్నా నిర్వహించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



కురవి: పరీక్ష సామగ్రి అందజేస్తున్న లింగయ్య



తొర్రూరు రూరల్: గోపా నాయకుల ఆధ్వర్యంలో..

కేసముద్రం : మండలంలోని పెనుగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకన్న, హెచ్‌ఎం యాదగిరి, ప్రసాద్, యాకన్న, శంకర్, రమేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్ : తెలుగు సమితి ఆఫ్ నేబ్రాస్కా యూఎస్‌ఏ, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కంబాలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలపదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కృష్ణయ్య, చిరంజీవి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలి

కురవి : విద్యార్థులు పదిలో ఉత్తీర్ణత సాధించి లక్ష్యాన్ని చేరుకోవాలని మాజీ ఎంఈఓ నల్ల లింగయ్య అన్నారు. గురువారం మండలంలోని నేరడ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని లింగయ్య సొంతంగా అందజేశారు. హెచ్‌ఎం బాలాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డోర్నకల్ : డోర్నకల్, చిలుకోడు, పెరుమాళ్లసంకీస జెడ్పీఎస్‌ఎస్‌ల్లో గురువారం విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. టీపీసీసీ సభ్యులు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ సహకారంతో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్యాడ్లను పంపిణీ చేశారు.

దాతల చేయూత అభినందనీయం

తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని మాటేడు జెడ్పీపాఠశాల పదోతరగతి విద్యార్థులకు గోపా సంఘం డివిజన్ అధ్యక్షుడు, వికాస్ స్కూల్ కరస్పాండెంట్ తాళ్లపెల్లి రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యాదవరెడ్డి, నాయకులు రాయిపెల్లి యాకయ్య, కుమార్, రావుల యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురవి జాతరకు భారీ బందోబస్తు



మాట్లాడుతున్న ట్రైనీ ఐపీఎస్ పండరీ చేతన్

కురవి : మహాశివరాత్రి సందర్భంగా భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల జాతరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని ట్రైనీ ఐపీఎస్ పండరీ చేతన్ అన్నారు. గురువారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. జాతరలో నలుగురు డీఎస్పీలు, 11 మంది సీఐలు, 28 మంది ఎస్సైలు, 18 మంది ఏఎస్సైలు, 30 మంది జమేదార్‌లు, 107 మంది కానిస్టేబుల్‌లు, 32 మంది మహిళా కానిస్టేబుళ్లు, 40 మంది హోంగార్డులు మొత్తంగా 270 మందితో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు తిరుపతిరావు, సురేష్, ఏఆర్ డీఎస్పీ పాల్గొన్నారు.

బంగారు కిరీటం అందజేత

భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి బ్యాంక్ లాకర్‌లో ఉన్న బంగారు కిరీటాన్ని ఆలయ ఈఓ సత్యనారాయణ, పోలీసుల రక్షణ నడుమ తీసుకొచ్చి ఆలయంలో అర్చకులకు గురువారం అందజేశారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



మహబూబాబాద్: మూడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమార్, రుక్ముద్దీన్ డిమాండ్ చేశారు. ఆ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పనికి తగిన వేతనాలు, డీఏ, హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నీలిమా, కరుణాకర్, వాణి, రమ్య, కిరణ్మయి, కిషోర్ కుమార్, కిరణ్, నరేష్, అశ్విని, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.